క్లుప్తంగా

సమరయోధుల చరిత్ర పుస్తకావిష్కరణ

నగరి : మున్సిపల్ పరిధి పుదుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీవాణి ట్రస్ట్ ముద్రించిన స్వాతంత్ర్య సంగ్రామ ధీరోదాత్తుల వీరగాథల పుస్తకాన్ని ఎంఈవో శ్రీదేవి బుధవారం ఆవిష్కరించారు. శ్రీ సరస్వతీ మాత సాంఘిక సేవా సమాజం సభ్యులు వినోద్ బాబు బహుకరించిన ఈ పుస్తకాలను ఎంఈవో ఉపాధ్యాయులకు అందజేశారు.

ఉత్తమ బీఎల్ఓగా ఫాతిమా



అవార్డు అందుకుంటున్న ఫాతిమా

గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరు వీఆర్వో రూహీఫాతిమా ఉత్తమ బీఎల్ఓగా ఎంపికయ్యారు. బుధవారం అమరావతిలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆమెకు అవార్డు,షీల్డు అందజేసి, అధికారులు సన్మానించారు. నూటికి నూరుశాతం ఓటర్లను నమోదు చేయడం, మృతి చెందిన వారి పేర్లను తొలగించడంతో ఉత్తమ బీఎల్ఓగా ఎంపికైనట్లు తహశీల్దారు ఇన్బనాథన్ తెలిపారు.

సిబ్బంది సమయ పాలన పాటించాలి

పాలసముద్రం : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ఎస్. విద్యావతి తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులు, మూమెంట్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.

పరీక్ష సామగ్రి వితరణ



వెదురుకుప్పం: పాతగుంట ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన జంగం బాలయ్య పదో వర్థంతిని పురస్కరించుకుని భార్య లలిత, కుమారుడు పవన్ బుధవారం పరీక్ష సామగ్రిని అందించారు. హెచ్ఎం చాముండేశ్వరి, సర్పంచ్ భువనేశ్వరి, వైస్ ఎంపీపీ విజయ, మాజీ సర్పంచ్ వెంకటముని, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మునిరెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

వరదయ్యపాళెం: మండల కేంద్రం వరదయ్యపాళెంలో ఆల్‌స్టామ్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ విద్యార్హతలు కలిగిన 286 మంది జాబ్‌మేళాకు హాజరుకాగా 136 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఆల్‌స్టామ్, మ్యాజిక్ బస్ ప్రతినిధులు అరుణ, జ్యోత్స్న, గోపి, పూర్ణిమ పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి



తొరూరులో పథకాలను వివరిస్తున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: గతంలో ఎన్నడూ లేనివిధంగా నేటి జగనన్న ప్రభుత్వంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా తెలిపారు. బుధవారం సాయంత్రం పుత్తూరు రూరల్ మండలం గోపాలకృష్ణాపురం సచివాలయ పరిధిలోని తొరూరు, తొరూరు హరిజనవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆరోగ్యశ్రీ పథకం ఆదుకుందా? అమ్మ ఒడి చదువు చెబుతోందా అంటూ ఆరా తీశారు. అందరూ అన్నీ అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రజలకు వంద శాతం సంక్షేమం, అభివృద్ధి జరగాన్న లక్ష్యంతో తమ ప్రభుత్వ పని చేస్తోందని చెప్పారు. ఎన్నికల సమయంలో పలు హామీలు గుప్పించి తర్వాత ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. జగనన్న ఇచ్చిన హామీలనే కాకుండా, చెప్పని పలు కార్యక్రమాలను సైతం అమలు చేస్తున్నారని, ఇదీ వైఎస్సార్ కుటుంబ నైజమన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. ఇలా పలు విధాలుగా ప్రజలకు చేయూతనిస్తున్న వైఎస్సార్‌సీపీని ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇందిర, ఎంపీపీ మునివేలు, కోఆప్షన్ మెంబర్ రాంబత్తయ్య, గ్రామ సర్పంచ్ వసంత, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, జయకుమార్, మునిరాజ, మురళి, పురుషోత్తం, గురుస్వామి, సంతోష్, ఆనంద్, గజేంద్ర, నారాయణ, సురేష్‌బాబు, విజయ్, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి రోజా

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

వడమాలపేట : గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని పర్యాటక, క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం మండల పరిధిలోని టీసీ అగ్రహారం, హరిజనవాడ గ్రామాల్లో గడప–గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన తాగునీటి సమస్య, డ్రైనేజీ నిర్మాణాలకు జీజీఎంపీ నిధులు రూ.15 లక్షలు, జెడ్పీ ఫండ్ రూ.7 లక్షలు, జీజీ ఎంపీ నిధుల 2.50 లక్షలతో తాగునీటి బోరు పైపులైన్ నిర్మాణ పనులకు భూమి మంత్రి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు, నవరత్నాలు అందించడమే కాకుండా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రవేశపెట్టి ఇంటివద్దకే పాలన అందిస్తున్నారని తెలిపారు. అనంతరం టీసీ అగ్రహారంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు ఇరగారెడ్డి మనవడు నామకరణం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అలాగే టీసీ అగ్రహారంలో వాసు కుటుంబ సభ్యులను మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. ఇటీవల ప్రమాదంలో గాయపడి వాసు మరణించారు. కుటుంబ సభ్యులను ఓదార్చుతూ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ అరుణ, తాహసీల్దార్ సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రవి, సదాశివకోన ట్రస్టుబోర్డు మెంబర్ కమల, నాయకులు పుల్లయ్య, ఇరగారెడ్డి, ముత్యాలురెడ్డి, యాదవేంద్ర రెడ్డి, వెంకటరెడ్డి, కిరణ్, మునిబాబు, వేణు, నందయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగనన్న



పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : సంక్షేమ రూపశిల్పి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సోమనాథపురం, టీవీపురం, కొత్తరోడ్డు, ఎగువ చెరువు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నూతన ఆవిష్కరణలకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని తెలిపారు. గతంలో పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ ఆదేశాలు అందేవి కాదని, నేడు వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. సువర్ణ పాలన అందిస్తున్న జగనన్న చల్లగా ఉండాలని ప్రజలు దీవిస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు జగనన్నకు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గ్రామస్తురాలు జమునను ఎవరికి ఓటు వేస్తారని అడగడంతో, గతంలో సంక్షేమ పథకాలు అంటే మాకు తెలియదని, జగనన్న వచ్చాక లక్షల రూపాయలు ఇంటికి చేరాయని, మా గుండెల్లో జగనన్నకు కొలువై ఉన్నారని ఆనందంగా తెలిపింది. గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకొచ్చిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

పథకాల అమలు భేష్ : కేంద్ర బృందం



కేంద్ర బృందాన్ని సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం

పెనుమూరు మండలంలో పథకాల అమలును కేంద్ర తీరును పరిశీలించి జాతీయస్థాయి పర్యవేక్షణ కమిటీ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. జాతీయస్థాయి పర్యవేక్షణ కమిటీ బృందం సభ్యులు శిశిర్‌కుమార్ సాహో, సత్యబ్రత్‌బెహరా గడప గడపకు కార్యక్రమంలో ఉన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామిని కలిసి పథకాల అమలు భేష్ అని ప్రశంసించారు. తాము క్షేత్రస్థాయిలో పథకాల అమలును పరిశీలించామని, ఏ రాష్ట్రంలో ఇన్ని సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, అవినీతికి ఏమాత్రం ఆస్కారం లేకుండా పథకాలను అందిస్తున్నారని, సచివాలయం, రైతుభరోసా, హెల్త్‌క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, నాడు–నేడుతో పాఠశాలలు, ఆస్పత్రుల ఆధునికీకరణతో జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాగుందని, కేంద్ర ప్రభుత్వానికి వివరిస్తామని తెలిపారు. సర్పంచ్ నవీన్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జమున, జిల్లా ప్రధాన కార్యదర్శి దూదిమోహన్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి,ప్రసాద్, జయచంద్రారెడ్డి, మునీంద్రరెడ్డి, రాజారెడ్డి, ఎంపీడీవో శివయ్య పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని మెజారిటీతో గెలిపించండి

కార్వేటినగరం: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిశీలకుడు వెంకటరమణారెడ్డి కోరారు. బుధవారం కార్వేటినగరం పంచాయతీ కార్యాలయ ఎంపీపీ లత ఆధ్వర్యంలో ఆవరణలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రులతో కలసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఇందులో భాగంగా కొటార్వేడు, కేఎంపురం, డీఎంపురం, కొల్లాగుంట సచివాలయ పరిధిలో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రులతో సమావేశమై శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హమీద్‌ఖాన్,



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెంకటరమణారెడ్డి

జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, విమల, మునికృష్ణ, సుబ్రమణ్యం, గాంధీ, శేషాద్రి, శేఖర్ రాజు, చందురాజు, ధనశేఖర్‌వర్మ, కృష్ణయాదవ్, వెంకటేష్, విజయ్ పాల్గొన్నారు.

నాణ్యతగా నాడు–నేడు పనులు

వెదురుకుప్పం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాడు–నేడు పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూడాలని జిల్లా సర్వశిక్షణ అభియాన్ పీవో వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రణాళిక తయారు చేసుకుని తగిన సమయానికి డేటాలు సమర్పించాలని తెలిపారు. నాడు–నేడు పనుల్లో ఎక్కడా అవకతవకలు లేకుండా చూడాల్సిన



మాట్లాడుతున్న పీఓ వెంకటరమణారెడ్డి

బాధ్యత సిబ్బందిదేనన్నారు. సకాలంలో పూర్తి చేయించాలని తెలిపారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ మనీష్‌రెడ్డి, సీర్పీలు అంకయ్య, మనోహర్, షణ్ముగం, మురళీరెడ్డి, బండి ప్రభాకర్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

- మంత్రి రోజా ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు
- మున్సిపల్ సమావేశంలో చైర్మన్ హరి

పుత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 26న గణతంత్ర దినోత్సవం నుంచి ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి పిలుపునిచ్చారు. బుధవారం వైఎస్సార్ సమావేశ మందిరంలో మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం చైర్మన్ హరి అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ మానావళి జీవన ప్రమాణాలకు విఘాతం కలిగించే ప్లాస్టిక్‌ను నిర్మూలనను కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని, అవాస్తవ ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా, అభివృద్ధి పనులు అందరికీ కనబడేట్లే జరుగుతున్నాయని తెలిపారు. మరి 'గాలి'కి ఎందుకు కనబడం లేదో అర్థం కావడం లేదన్నారు. 2014 నుంచి 2018 వరకు చంద్రబాబు పాలనలో నగరి నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదన్నారు. 2019లో జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరిలో మంత్రి రోజా నేతృత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని చెప్పారు. ఒక్క పుత్తూరులోనే రూ.185 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించగా, ఇప్పటికే రూ.25 కోట్ల పనులు పూర్తయి ప్రారంభోత్సవాలు జరిగినట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.139 కోట్లతో శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలువ నుంచి పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకుకు పైపులైను పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రూ.2 కోట్లతో మున్సిపల్ భవనం, రూ.1.85 కోట్లతో షాదీ మహాల్ వంటి పలు పనులు జరుగుతున్నాయని వివరించారు. సమావేశంలో కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాలు

- 1వ వార్డు కొత్తతిమ్మాపురం నుంచి కట్టకింద రామకృష్ణాపురం వరకు రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- 9వ వార్డులో బత్తలవారికండ్రిగ నుంచి వీరప్పరెడ్డి పాళెం వరకు రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- 21వ వార్డు కాపువీధిలో 400 మీటర్ల మేర రూ.17 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణం
- 13వ వార్డు అమరంకండ్రిగలో అంకమ్మ ఆలయం వద్ద నుంచి గ్రామం వరకు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- 2వ వార్డు ఒంటిమిట్ట గ్రామంలో 6.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- 11వ వార్డు సాయినగర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- 4వ వార్డులోటీ షాపు లక్ష్మి ఇంటి వద్ద నుంచి సత్యనారాయణకాలనీ వరకు, లక్ష్మి టీ షాపు నుంచి బాలాజీ నగర్ వరకు రూ.25 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణం

ఓటుతోనే ప్రజాస్వామ్యం సాధ్యం

నగరి : ప్రజాస్వామ్యం ఓటుతోనే సాధ్యమని ఆర్డీవో సుజన అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెవెన్యూ సిబ్బంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కొండచుట్టు మండపం ఆవరణలో మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓటు ఆవశ్యతను వివరించారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమౌతుందన్నారు. సీనియర్ ఓటర్లు చెంగయ్య శెట్టి, వెంకయ్యను సన్మానించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున రావు, ప్రిన్సిపల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపల్ సుబ్రమణ్యం, ఎన్ఎస్ఎస్ అధికారి గోపి, ఎన్‌సీసీ అధికారి భాస్కర్, అకడమిక్ కోఆర్డినేటర్ భాస్కర్‌రాజు, నరసయ్య, ఆర్ఐలు, వీఆర్వోలు, అధ్యాపకులు, బూత్‌లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

గంగాధరనెల్లూరు : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని తహశీల్దారు ఇన్బనాథన్ తెలిపారు. బుధవారం తహశీల్దారు కార్యాలయంలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించా రు. డీటీలు తులసీరామ్, చంద్రశేఖర్, వీఆర్వోలసంఘం అధ్యక్షుడు రవి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పుత్తూరు రూరల్: ప్రజాస్వామ్యానికి ప్రతిబింబమే ఓటు అని, దాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ అధికారి రఘురామన్, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రోశయ్య, ఎంపీడీఓ ఇందిర, డీటీ రవికుమార్, వీఆర్ఓ గురుస్వామి పాల్గొన్నారు.

నిస్వార్థ నాయకులను ఎన్నుకోవచ్చు

కార్వేటినగరం: నిస్వార్థ నాయకులను ఎన్నుకోవడానికి ఓటు హక్కు ఎంతో దోహదపడుతుందని తహసీల్దార్ అమర్నాథ్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మోహన్ మురళి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ధనంజయులురెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



జీడీనెల్లూరులో ర్యాలీ





ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ప్రతిజ్ఞ చేయిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి



నిండ్రలో..



నగరి : మానవహారం



పాలసముద్రం: ప్రతిజ్ఞ చేస్తున్న సచివాలయ సిబ్బంది

నిండ్రలో..

నిండ్ర: మండల కేంద్రంలో తహసీల్దార్ అమరేంద్ర బాబు ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఎంపీడీఓ వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటుహక్కు ఎంతో విలువైంది

పాలసముద్రం : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైందని మండల విస్తరణాధికారి రమేష్, సర్పంచ్ లిల్లీ తెలిపారు. వెంగళరాజుకుప్పం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఓటర్ల దినోత్సవ ర్యాలీ చేశారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

వెదురుకుప్పం: ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్న పూర్ణ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును విధిగా, ప్రాథమిక హక్కుగా భావించి వినియోగించుకోవాలన్నారు.

త్రిశూల స్నానం ఏర్పాట్ల పరిశీలన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని స్వర్ణముఖి నదిలో నిర్వహించే త్రిశూల స్నాన ఏర్పాట్లను బుధవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. జలవినాయకస్వామి ఆలయం సమీపంలోని స్వర్ణముఖి నదిలో పంచమూర్తులను కొలువు తీర్చి పూజలు నిర్వహించడానికి ఇంజినీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో శాశ్వత వేదిక నిర్మాణం చేపట్టారు. అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ నదిలో పుష్కరుడు కొలువు దీరినవేళ సర్వేశ్వరుడు త్రిశూల రూపంలో స్నానం ఆచరించేందుకు ప్రత్యేక కొలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్రిశూల స్నానం సమయంలో భక్తులు స్నానమాచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

శ్రీపాద శ్రీవల్లభ స్వామికి సాదర స్వాగతం



స్వామిజీకి స్వాగతం పలుకుతున్న భక్తులు

రేణిగుంట: శ్రీపాద శ్రీవల్లభ సంస్థానాధీశులు వెంకట విశ్వనాథంస్వామికి రేణిగుంట మండలం ఎల్లమండ్యం యోగానంద కళాశాల సమీపంలో ఘన స్వాగతం లభించింది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితో కలసి ఆయన ఏర్పేడు మండలం గుడిమల్లం వెళుతుండగా రేణిగుంట మండలానికి చెందిన వారు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకుని స్వామివారి ఆశీర్వచనాలు పొందారు. రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మన్యం శ్రీనివాసులురెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, సర్పంచ్ నగేషం, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాన్ రాజ, గంగయ్య తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు నిషేధం

నగరి : ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుంచి ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలను నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది బుధవారం తొలగించారు. దుకాణదారులకు హానికర ప్లాస్టిక్ వినియోగించకూడదంటూ హెచ్చరికలు జారీచేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీల ఉత్పత్తి, దిగుమతిలతో పాటు వినియోగం, ముద్రణ, రవాణా, ప్రదర్శనలను నిషేధించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ స్థానంలో గుడ్డ సంచులు, జూట్ సంచులు, కాటన్ బ్యానర్లు, కాటన్ ఫ్లెక్సిలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాతోపాటు చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఫ్లెక్సీలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరులో పౌష్టికాహారం అందజేస్తున్న చైర్మన్ హరి, కౌన్సిలర్లు

పుత్తూరు రూరల్: పుత్తూరు వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ పంపిణీ చేశారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా వితరణతో ప్రతి బుధవారం పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రులకు పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు పౌష్టికాహార పంపిణీ క్రమం తప్పకుండా జరుగుతోంది. గర్భిణులకు, వారి సహాయకులకు విజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీ, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందించారు. పుత్తూరు ఆస్పత్రిలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణస్వామి, పుష్పమ్మ, కౌన్సిలర్లు చిట్టిబాబు, వనిత, జయలక్ష్మి, నవనీత, భానుమతి, కోఆప్షన్ మెంబర్ షకీలా తదితరులు పాల్గొన్నారు. నగరి ఆస్పత్రిలో గర్భిణులకు మెడికల్ సూపరింటెండెంట్‌లు బాలకృష్ణనాయక్, రాజారత్నమ్మ, ఆర్ఎంవో గోపా ల్ తదితరులు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

వేలానికి 45 వాహనాలు

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని 45 వివిధ వాహనాలను వేలం వేయనున్నట్లు అధికారులు చెప్పారు. బుధవారం కాలపరిమితి దాటిన వాహనాలను వేలానికి ఎంపిక చేశారు. అధికారులు రమేష్‌బాబు, రాజేశ్వరరావు, ఇబ్రహీం, రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 23,850 డోసుల కోవిషీల్డ్

చిత్తూరు రూరల్: జిల్లాకు 23, 850 డోస్‌ల కోవి షీల్డ్ వ్యాక్సిన్లు అందాయని డీఐఓ రవిరాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. 60 ఏళ్లు పైబడిన వారికి బూస్టర్ డోస్ కింద వీటిని వేస్తామన్నారు. అలాగే యథావిధిగా వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.